# వారు కవిత్వాన్ని ద్వేషిస్తారు

నిప్పులు కక్కుతారు
తప్పులు మెక్కుతారు
అప్పుడప్పుడు వారు
కవితలు చెప్పుతారు
భాషాంగన నోట్లో
గుడ్డలు కుక్కుతారు



కిలికించితాల బూజు
ఆత్మరతుల మోజు
నిత్యం మావోజపం కరోమి
నిత్యం ఫ్రాయిడ్ సింబల్సు స్మరామి

వారు కవిత్వాన్ని ద్వేషిస్తారు
కవిత్వం ఎక్కడ కనిపించినా
వారికి కళ్లు మండుతాయి

భాషా సరస్సులో వికసించిన
మృదుపద కమలాలను
కసిగా నలిపేస్తారు

ఠీవిగా నడిచే తెలుగువాక్యాన్ని
మొరటు మాటల లాఠీలతో
విరగబొడుస్తారు.

భాషావనంలో విరిసిన
భావ మందారాలను తలకిందులుగా
వేలాడగట్టి ఉరి తీస్తారు

వారు అభిరుచిని ద్వేషిస్తారు
అభిరుచి ఎక్కడ కనిపించినా
వారికి ఒళ్లు మండుతుంది

గావుకేకల విప్లవ నిబద్ధతా
వాక్శూరులు వారు
విప్లవ యోనీ పునః పునః
ప్రవేశ నిర్గమన ప్రవీణులువారు

వారు కవిత్వాన్ని ద్వేషిస్తారు
కవిత్వం ఎక్కడ కనిపించినా
నిప్పులు కక్కుతారు

వారు అభిరుచిని ద్వేషిస్తారు
అభిరుచి ఎక్కడ కనిపించినా
నిప్పులు తొక్కుతారు.

"అభిరుచి అయ్యవార్లు" (జ్వాలాముఖి) అనే కవితకు సమాధానంగా.

చేరా

# కాలమ్ దాటని కథ

రాగయ్య ఆ పట్టణానికి మకుటం లేని మహారాజు. ఐతే ఓ ముప్పై ఏళ్ళ క్రితం ఆయన ఆస్తిపాస్తుల వివరాలు అప్పటినుంచి ఆ ఊళ్ళోనే ఉంటున్న కొద్దిమందికే తెలుసు. కాని వాళ్ళు అప్పటికీ ఇప్పటికీ పేదవాళ్ళుగా ఉండటంతో గిట్టక చెప్తున్నారని అందరూ అనుకొంటారు.

రాగయ్య పేదవాళ్ళని ఆదుకొంటాడు. వాళ్ళంతా ఆతని వ్యాపారం అంచెలంచెలుగా పెరగటానికి తోడుపడ్తూంటారు. ఎలెక్షన్లప్పుడైతే ఎడ తెరిపి లేకుండా పనిచేస్తారు. దానికిగ్గాను రాగయ్య వారికి గంజీ కల్లు కుడి ఎడమ్మ తేడా లేకుండా సమానంగా సరఫరా చేసేవాడు.

కాలం ఒకలాగా జరగదు. జనం జరగనివ్వరు. బచ్చెయ్య కొంతకాలంగా పేదలతో కలిసి మెలిసి ఉంటున్నాడు. ఏం చదువుకున్నాడో తెలియదు కాని పై దేశాల కబుర్లు చెబుతూ ఉండేవాడు. ప్రపంచ కార్మికులేక్యం కావాలని బూర్జువా విధానం నశించాలని ప్రతి, ఐదు నిముషాలకి అంటూ ఉంటాడు. పేదవాళ్ళతనంటే పడిచస్తారు.




రాగయ్య గమనించాడీ సంగతి. పనివేళల తగ్గింపు. జీతాల పెంపు 'మేడే' కి జీతం సెలవు మొదలైనవన్నీ చూసిచిరాకు పడ్డాడు. జనాలకు కల్లు తగ్గించలేదుగాని గంజి తగ్గించాడు. ఆ మేరకు కర్రలు సరపరా చేశాడు. వాటి ఉపయోగంతో పోలీసు కేసులు, వాటిని మాఫీ చేయటానికి రాగయ్య పలుకబడి.

బుచ్చెయ్యను బుజ్జగించసాగాడు రాగయ్య వాడికి మేస్త్రీ ప్రమోషనిచ్చాడు. వాడికొడుక్కి కాన్వెంటు చదువు కోసం డబ్బిచ్చాడు. ఇప్పటికీ బచ్చెయ్య కార్మికనాయకుడే. మేడేనాడు మాత్రం ఎర్రజెండా లెగురుతాయ్. ఉపన్యాసాలు సాగతాయ్ మిగిలిన అన్ని రోజులు ఖరీదుగల పానీయాలతో సిగరెట్లతో దుస్తులతో కాలం గడుపుతున్నాడు బుచ్చెయ్య.

ఏడాదికొకసారి సమ్మె జరుగుతుంది. రాగయ్య కూడా మునపటిలా కాకుండా బుచ్చెయ్య చేసే పది డిమాండ్లలో ఆట్టే ఖర్చుకాని ఐదారింటిని ఒప్పేసుకొంటున్నాడు. ఆ తీరని డిమాండ్లు ప్రతి సమ్మె నోటీసులోనూ దర్శనమిస్తూనే ఉన్నయ్.

చిట్టా దామోదరశాస్త్రి